**కథ**

# డోగిసలాడకే మనసా...

ఓ గా కళ్ళెత్తి చూసిందామె.

ఎదురుగ వేరు శనక్కాయల బండి దగ్గర అతను నిలబడి ఉన్నాడు. వేడి వేడి పల్లీలు పొట్లం కట్టించుకుంటున్నాడు. ఆ పని చేస్తూనే మధ్య మధ్య ఆమె వైపు చూస్తున్నాడు.

ఇద్దరి కళ్ళూ కలిశాయి.

ఆమెకి గుండె ఝల్లుమంది.

'నన్నే చూస్తున్నాడు' మనసులో గర్వంగా అనుకుంది.

'తనలాంటి అందగత్తెని ఎవరు మాత్రం చూడరు? అతనొక్కడే కాదు..ఏ మగాడయినా సరే...ఇక్కడు న్నంత సేపూ చచ్చినట్టు అలా చూస్తూ ఉండవలసిందే! నలుగుర్నీ ఆకర్షించే తన టీనేజ్ అందంలో ఉన్న ప్రత్యేకతే అది' అతిశయం ఆమె చేత ఏమేమో ఆలోచింపజేస్తోంది.

మరోమారు చుట్టూ చూసింది, ఇంకా ఎవరెవరు తన వైపు చూస్తున్నారో తెలుసుకోవడానికన్నట్టు! ఆమెకి అర గజం దూరంలో నిలబడి ఉన్నాడు యువకుడు.

గ్రే కలర్ డ్రెస్‌లో, అందంగ హుందాగా ఉన్నాడు. చేతిలో బిజినెస్ ఎక్స్యాటివ్స్ ఉపయోగించే బేగ్! అతకళ్ళలో చెప్పలేనంత ఆత్రం అదంతా..అతనికి కావలసిన సిటీ బస్ కోసం! అతని దృష్టంతా రాబోయే సిటీ బస్ మీదే ఉండడంతో ఆమె అహం దెబ్బతిన్నట్టయింది

'ఛీ! అందాన్ని చూడ్డం తెలీని గుడ్డి సన్నాసి' అచ్చ తెలుగులో మనసులోనే తిట్టుకుంది.

'సంపాదన కోసం ఎంత పరుగో! ఎంత ఆరాటమో, డబ్బుదేం ఉంది? ఇవాళ ఉంటుంది..రేపు పోతుంది. డబ్బు శాశ్వతం కాదు. ప్రేమ శాశ్వతం' ఏవేవో ఆలోచిం చేస్తోందామె!

ఇంతలో ఏదో బస్సొచ్చింది. ఆ యువకుడు ఎక్కి వెళ్ళిపోయాడు. అక్కడితో ఆమె ఆలోచనలు 'కట్' అయిపోయాయి.

అంతలో...మళ్ళీ 'అతను' గుర్తొచ్చాడు.

చుట్టూ చూసింది.

ఆమెకి ఆరడుగుల దూరంలో నిలబడి 'ఇటే' చూస్తూ వేరుశనక్కాయలు ఒల్చుకు తింటున్నాడు.

ఆమెకి తెలుసు...తను బస్సు ఎక్కే వరకూ అతను, అక్కడ..అలాగే కాలక్షేపం చేస్తాడని.

'అదంతా తన కోసమే! పడి చస్తున్నాడు!' అనుకుంటూంటే ఆమెకి చాలా గొప్పగా అనిపించింది.

తనో పెద్ద విజేతలా ఫీలవుతూ బలవంతాన చూపులు పక్కకి తిప్పుకుంది. ఆమె కళ్ళకి మూడడుగుల దూరంలో కనిపించిందో శాల్తీ!

నల్లగా తారు డబ్బాలా! ఆ గున్న ఏనుగు చూపులు మాత్రం ఆమె మీదనే కేంద్రీకృతమయ్యాయి. అతని కళ్ళనిండా ఆకలి..కాంక్ష..కళ్ళతోనే ఆమె అందాల్ని ఆబగా తాగేసే ప్రయత్నం. చూస్తున్న ఆమెకి ఒంటి మీద గొంగళి పురుగులు పాకినట్టయింది.

''ఛీ ఛీ! ఎలా చూస్తున్నాడో...అసహ్యంగా'' చిరాగ్గా అనుకుంది. విసుగ్గా ముఖం తిప్పుకుంది.

మళ్ళీ ఏదో బస్సొచ్చింది.

చాలా మంది ఎక్కారు.

అతను, తారు పీపా తప్ప!

అతను ఎక్కకపోవడం ఆమెకి సంతోషాన్నీ, తారు పీపా ఉండిపోవడం అసహ్యాన్నీ కలిగించాయి. ఆ మగ మృగం చూపుల్నుంచి తప్పించుకుందామని చూసింది. కానీ సాధ్యం కాలేదు.

'బస్సు ఒస్తే ఎక్కి వెళ్ళిపోవడం తప్ప గత్యంతరం లేదు' మనసులోనే అనుకుంది. అప్రయత్నంగానే తారు పీపా వైపు చూసింది.

ఆ కళ్ళలో ఆకలి మాత్రమే కాదు పెదవుల చివర్నుంచి చొంగ కూడా కారంతోందేమోనన్న అనుమానం వచ్చింది.

'దొంగ రాస్కెల్...పెళ్ళయిపోయినట్టుంది..అందుకే పరాయి ఆడదాన్ని..అందునా తన లాంటి చిన్నపిల్లని ఎంత ఆబగా చూస్తున్నాడో! మనిషి చూస్తే నలభై పైనే ఉన్నట్టనిపిస్తోంది. ఇంత వయసొచ్చినా బుద్ధి పెరిగినట్టు లేదు. అందమైన ఆడపిల్లని చూస్తే చాలు! చొంగలు కార్చెయ్యడమే. నిజంగా ఆడదానికి అందమే శాపం' పరి పరివిధాల తలపోస్తుండగానే బస్సొచ్చింది.

అది ఆమెకి కావలసిన బస్సే! చటుక్కున అటు పరుగెత్తి బస్సెక్కేసింది. ఎక్కుతూనే కేజువల్‌గా తల తిప్పి భుజాల మీంచి వెనక డోర్ వైపు చూసింది. అతను...చేతిలో ఉన్న వేరు శనక్కాయల పొట్లం విసిరేసి...రన్నింగ్‌లో ఉన్న బస్‌ని అంది పుచ్చుకున్నాడు.

తను ఎక్కిన బస్సే అతనూ ఎక్కడం చూసి హాయిగా ఊపిరి పీల్చుకుంది.

అటు చివర్లో..ఫుట్ బోర్డ్‌మీద..అతను!

ఇటు చివర్లో..ఫుట్ బోర్డ్‌కి కొంచెం పైన..ఆమె!

బస్సు క్రిక్కిరిసి ఉన్నా వాళ్ళ మధ్యమాత్రం ఏ అడ్డూ లేదు. అతని చూపులు మెత్తని పూలబాణాల్లా ఆమెని తాకుతూనే ఉన్నాయి.

ఆమె బస్సు దిగి కాలేజీ కాంపస్‌లోకి అడుగుపెట్టే వరకూ అదే తంతు!

నిజానికి కొన్నాళ్ళ క్రితం వరకూ ఆమెకి 'చదువు' తప్ప వేరే ధ్యాస లేదు.

కానీ...సరిగ్గా నెల క్రితం...

ఆమె పదహారో పుట్టిన రోజు జరిగింది.

ఆ సందర్భంగా ఆమె ఫ్రెండ్స్ అందరూ స్వీట్ సిక్స్‌టీన్ గురించి ఏవేవో చెప్పారు. ఎంతెంతో చెప్పారు. అది లగాయితూ ఆమె ఆలోచనలన్నీ 'గమ్యం' లేని దిశగా సాగడం ప్రారంభించాయి.

సరిగ్గా అప్పుడే...బస్టాప్‌లో 'అతను' కనిపించాడు. అతని చూపులు ఆమెని వెంటాడ్డం ప్రారంభించాయి. అక్కణ్ణుంచీ ఆమె మనసు మారిపోయింది. కళ్ళెంలేని గుర్రంలా ఎటెటో పరుగులు తీయడం మొదలెట్టింది.

ఆ ఉరకల్లో...ఒరపడిలోని భాగమే ప్రస్తుతం జరిగిందంతా!

★★★

కొన్ని కొన్ని విషయాల్లో వెంటనే ఓ నిర్ణయానికి రావడానికి పెద్ద పెద్ద కారణాలే ఉండాల్సిన అవసరం లేదు. చిన్న చిన్న సంఘటనలు కూడా చాలు!

గతవారం రోజులుగా ఆమెకి తిండీ నీళ్ళూ సయించట్లేదు. కంటి మీద కునుకు లేదు.

ఇరవై నాలుగ్గంటలూ అవే ఆలోచనలు. అతనికి సంబంధించినవే అన్నీ! ఆలోచించడమంటూ మొదలెడితే ఇక అపబుద్ధి కాదు. ఇవన్నీ చూస్తుంటే...తనకి అతని మీద ఓ అభిప్రాయం 'ఏదో' చాలా బలంగా ఏర్పడిందేమోనన్న అనుమానం కలిగిందామెకి!

బాగా ఆలోచిస్తే...అది ప్రేమేనేమో అన్న అనుమానం కలిగింది. ఇంకా ఆలోచిస్తే అదే నిజమన్న నమ్మకమూ ఏర్పడింది.

'నిజంగానే...అతను ఆ బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌లా డబ్బుకి మాత్రమే ప్రాధాన్యమిచ్చే మనిషి కాడు. తను చూసిన తారుపీపాలా అందాన్ని ఆబగా చూస్తూ చొంగలు కార్చే తక్కువ మనిషి అంతకంటే కాదు. కేవలం ప్రేమకి మాత్రమే ప్రాధాన్యమిచ్చే మనిషి! అందుకే తనంటే అతని కళ్ళలో అంత ఆరాధన! తన మీద ఎంత అభిమానం లేకపోతే అంతలా చూస్తాడూ?

ఇంక లేట్ చెయ్యకూడదు. ఆలస్యం అమృతం విషం. వెంటనే అతన్తో...ఎలాగోలా వీలు చూసుకుని చెప్పేసెయ్యాలి..ఐలవ్‌యూ! అని..' అనుకుంది.

ఆలోచనలన్నీ ఓ కొలిక్కి ఒచ్చాకనే ఆమెకి మనసు కుదుట పడింది.

★★★

ఆమె కళ్ళు విప్పార్చుకుని నల్దిక్కులా వెదికింది.

వేరుశనక్కాయల బండి దగ్గ..అటూ..ఇటూ! ఎక్కడా అతను లేడు!

''ఏమైపోయినట్టు?'' తనకి తాను ప్రశ్నించుకుంది. సమాధానం దొరకలేదు.

'ఎవర్నయినా అడిగితే?' అనుకుంది.

కానీ ఎవర్నని అడుగుతుంది?

బస్టాప్‌లో అతన్ని గమనించి గుర్తుపెట్టుకుని ఒచ్చాడో లేదో చెప్పేవాళ్ళెవరు? ఎవరి హడావిడి వాళ్ళది. ఎవరి పనులు వాళ్ళవి.

ఆమెకి నిరాశగా అనిపించింది. ప్రపంచమంతా శూన్యంలా తోచింది. మనసంతా అదోలా అయిపోయింది.

కాళ్ళీడ్చుకుంటూ ఒచ్చి బస్సెక్కి కాలేజీకి చేరుకుంది.

ఆరోజే కాదు..


మరో వారం వరకూ అతని కోసం ఎదురుచూసింది. అంతా వెదికింది. ఎంతగానో నిరీక్షించింది.

అతను కనపడలేదు. అసలు అతను ఎవరో ఏమిటో..ఏమైపోయాడో కూడా తెలీదు.

ఎనిమిదో రోజు రాత్రి...

ఆమెకెందుకో దుఃఖం ముంచుకొచ్చింది. తనివి తీరా ఏడ్చింది. తెప్పరిల్లాకా అనిపించింది. అసలు తనెందుకు ఏడ్చింది?–

అతని కోసమా? అయితే అతను తనకేమవుతాడని?



ప్రేమించిన ప్రియుడా? మంగళసూత్రం కట్టిన మొగుడా? లేక రక్తసంబంధాన్ని పంచుకున్న మేనత్త కొడుకా?

ఎవరని ఎదురు చూసింది..అని!

ఆ ప్రశ్నలు అలా పదే పదే తల్చుకుంటూంటే ఆమెకెందుకో నవ్వొచ్చింది. నవ్వుకుంది.

ఇంకా డీప్‌గా ఆలోచిస్తే...ఇన్నాళ్ళ తన ప్రేమా ట్రాష్‌గా అనిపించింది. తనదో పిచ్చిలా తోచింది. ఏవిటింత ఫూల్‌లా ప్రవర్తించింది తను? అనుకుంది. అనుకుని మళ్ళీ నవ్వుకుంది.

'జీవితమంటే పూల పాన్పు కాదు. ముళ్ళూ ఉంటాయి. వాటిని తప్పించుకుని నడవాలి. జీవితమంటే పడ్డించిన విస్తరికాదు. ఒక్కోసారి ఖాళీ కంచం కూడా కావచ్చు. అప్పుడది నింపుకోవడానికి అన్నీ మనమే సమకూర్చుకోవలసి ఉంటుంది. ప్రేమే జీవితం కాదు. అదొట్టి భ్రమ మాత్రమే–అందుకే టీనేజ్ లవ్ అంత తెలివితక్కువతనం మరొటి లేదు.

అసలైన యవ్వనమంటే టీన్సే. దాన్ని అనుభవించడం అంటే నవ్వుతూ తుళ్ళుతూ ఉండడం...ఓ లక్ష్యాన్ని ఎంచుకోవడం...దానికోసం రేయింబవళ్ళూ కష్టపడడం. అంతే తప్ప ఎవరో అనామకుల కోసం ప్రేమంటూ వెంటబడడం, ఆరాధనంటూ మనల్ని మనం వంచించుకోవడం, అవకాశం వస్తే జీవితానుభవం వంకతో అడ్డదార్లు తొక్కడం, అన్వేషణ అనో, నిరీక్షణ అనో కాలాన్ని వృథా చేసుకోవడం ఎంతమాత్రం కాదు..' అనిపించింది.

అలా అనిపించాకా...అప్పుడు ఆమె మనసు తేలికపడింది.

తెల్లారింది.

ఆమె బస్టాప్‌కి చేరుకుంది.

కానీ అతనికోసం వెదక లేదు. తనకి కావలసిన బస్ కోసం ఎదురు చూస్తూ నిలుచుంది.

బస్ వచ్చింది.

'బేగ్‌వాలా' బస్ కోసం పరుగు తీశాడు. అతన్ని చూస్తుంటే ఆమెకి ముచ్చటేసింది.

'లక్ష్యం పట్ల ఎంత శ్రద్ధో! మనిషంటే అలా ఉండాలి' అనుకుంది.

అతను వెళ్ళిపోయాడు.

ఆమె ఆలోచనలు తెగిపోయాయి.

అంతలోనే ఏదో గుర్తొచ్చినట్టుగా తల పక్కకి తిప్పి చూసింది.

తారుడబ్బా కనిపించాడు.

అతని చూపుల్లో మార్పేం లేదు.

'పాపం! పూర్ ఫెలో!' అనుకుంది.

ఇంతలో..ఆమెకి కావలసిన బస్ వచ్చింది.

ఆలోచనలకి ఫుల్‌స్టాప్ పెట్టేసి బస్సెక్కేసింది.

★★★

నిజమే...

టీనేజ్ అంటేనే కొన్ని కలలు. కొన్ని భ్రమలు..ఇంకొన్ని ఊహలు..కొన్నిటి కోసం ఆరాటం...మరికొన్నిటి కోసం పోరాటం...భ్రమలో బతకడానికి కొంతకాలం..దాంట్లోంచి బయటపడి వాస్తవంలోకి రావడానికి ఇంకొంత కాలం.

ఈ ఎగుడు దిగుళ్ళ హడావిడిలో ఎందరు బాగుపడతారో? మరెందరు దిగజారిపోతారో?

అందుకే...ఎప్పుడూ, ఎట్టి పరిస్థితుల్లోనూ మనసు కళ్ళేల్ని వదిలేయకూడదు. మనసుని ఊగిసలాడనీయకూడదు!

యువతా! బహుపరాక్! ★

అగస్త్యప్రగడ హేమంత